క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

ఎల్కతుర్తి : హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ నేడు (ఆదివారం)మండలానికి రానున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్యగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోతులనడుమ, పెంచికపేట గ్రామాల్లో కొత్తగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలింగ్‌స్టేషన్లలో ఆర్డీఓ పరిశీలన



నడికూడ : మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను పరకాల ఆర్డీఓ శ్రీనివాస్ శనివారం సందర్శించి పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులకు సంబంధించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుండాల నాగరాజు, ఆర్ఐ హేమానాయక్, బూత్ స్థాయి అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేత్రదానం

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని కొత్తూరుకు చెందిన పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు పరాంకుశం అనంతస్వామి శనివారం తన నివాసంలో హఠాన్మరణం పొందారు. తాను మృతి చెందాక తన నేత్రాలను దానం చేయాలని మాస్టారు బతికున్నప్పుడే కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆయన కోరిక మేరకు అనంతస్వామి మృతి చెందిన విషయాన్ని సదాశయ ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. దాంతో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ ద్వారా ఎల్‌వీపీ టెక్నీషియన్ నరేందర్ సహకారంతో మృతుడి నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఐ బ్యాంకుకు పంపించారు. మాస్టారు స్ఫూర్తిని గౌరవిస్తూ కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

సిక్స్ మెన్ కమిటీ కృషికి మద్దతు పలకాలి

నయింనగర్ : అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇప్పించేందుకు సిక్స్ మెన్ కమిటీ చేస్తున్న కృషికి మద్దతు పలకాలని, అసత్య ప్రచారాలు పట్టించుకోవద్దని సిక్స్ మెన్ కమిటీ కోరింది. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో సిక్స్ మెన్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. కమిటీ కన్వీనర్ బీఆర్.లెనిన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోకన్వీనర్లు వేముల నాగరాజు, దయాసాగర్ సభ్యులు గడ్డం రాజిరెడ్డి, ఎం.సుధాకర్, బొల్లారపు సదయ్య పాల్గొని పలు నిర్ణయాలు తీసుకున్నారు. సభ్యుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి 5ఏళ్ల కంటే తక్కువ అనుభవం ఉన్న దరఖాస్తులను తిరస్కరించి తుది జాబితాను రూపొందించినట్లు వారు తెలిపారు. అనుభవం ఉన్న జర్నలిస్టుల విషయంలో మానవతా దృక్పథంతో కమిటీ వ్యవహరించిందని పేర్కొన్నారు. భూ సేకరణ కోసం అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు.

ఉపాధి శిక్షణను వినియోగించుకోండి

మడికొండ: యువకులు ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. కాజీపేట మండలం మడికొండ వ్యాసపురి కాలనీలోని శ్రీవేదవ్యాస పబ్లిక్ స్కూల్‌లో సేవా భారతి, గోద్రెజ్ ఆధ్వర్యంలో సెంటర్ పర్ ఎక్సలెన్స్ పేరుతో ఎయిర్ కండీషనర్, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్, మైక్రో ఓవెన్, ఇతర గృహోపకరణల మరమ్మతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభం కానుందని ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 90599 07740 నంబర్‌లో సంప్రదించాలని సేవా భారతి జిల్లా కార్యదర్శి ఎం.హనుమారెడ్డి, ఆవాస ప్రధాన కార్యదర్శి సుద్దాల వెంకటనారాయణ, మహేష్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

నిఘా పెంచండి

ఖిలా వరంగల్: వరంగల్ 33వ డివిజన్ పెరకవాడలో రాత్రి, పగలు పోలీసుల నిఘా పెంచాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల పెరకవాడలోని దేవాలయంలో హుండీని గుర్తు తెలియని ధ్వంసం చేసి వ్యక్తులు చోరీ చేశారు. ఆ ఘటన మరక ముందే శుక్రవారం అర్ధరాత్రి పెరకవాడ వీధుల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరించారని స్థానికులు తెలిపారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

మడికొండ: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చువాలని మాస్టర్జీ పాఠశాల కోఆర్డినేటర్ భరత్‌కుమార్ సూచించారు. మడికొండలోని మాస్టర్జీ పాఠశాలలో స్కూల్ లీడర్స్, గ్రూప్ లీడర్స్ ప్రమాణ స్వీకారం, బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి భరత్‌కుమార్ శనివారం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షీలో, ఏఓ రమష్‌బాబు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో 50 శాతం కేటాయించాలి

- ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు భిక్షపతి

ఎల్కతుర్తి : విద్యారంగానికి బడ్జెట్‌లో 50 శాతం నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కర్రె భిక్షపతి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆ సంఘం 88వ వార్షికోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో సంఘం జెండాను శనివారం ఆయన ఎగరేసి కేక్ కట్ చేసి మాట్లాడారు. దేశంలో విద్యార్థులకు సాంకేతిక విద్యను మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న తరుణంలో అందుకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో, వసతిగృహాల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత పాలకుల మీదే ఉందన్నారు. సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికే కాకుండా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కార్యాచరణ చేపడతామని తెలిపారు. సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసి సమరశీల పోరాటాలు నిర్మించడం ద్వారా పరిష్కారానికి బాటలు వేస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని రాజకీయాలు, పరిణామాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా, ఆటపాటల్లోనూ, సామాజిక రంగంలోనూ రాణించి ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్, మండల కార్యదర్శి మాచర్ల రాజాగౌడ్, ఉపాధ్యక్షుడు బోనగిరి కుమార్, ఉట్కూరి సురేష్, చిర్ర సాయిచందు, లకస్, సాయిప్రభాస్, రవితేజ, రాకేష్, మారుపాక సహర్ష్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న భిక్షపతి

ప్రజల సంక్షేమమే ధ్యేయం

కమలాపూర్ : హుజురాబాద్ నియోజకవర్గ ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తెలిపారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాలులో శనివారం నిర్వహించిన వర్ధంతి సభలో తన తండ్రి ఈటల మల్లయ్య చిత్రపటానికి సోదరులు సమ్మయ్య, భద్రయ్య, కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన పుల్ల ఎల్లమ్మ, మూడెడ్ల రవి ఇటీవల మృతి చెందగా వారి చిత్రపటాలకు నివాళులర్పించి బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే ఈటల పరామర్శించారు. తదనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న జన్ను రమేష్, మూడెడ్ల జ్యోతి, ఉప్పల్‌లో గాయపడ్డ పోతిరెడ్డి నవీన్‌లను కలిసి పరామర్శించారు. జ్యోతికి ఆర్థికసాయం అందించి మెరుగైన చికిత్స కోసం ఆర్‌వీఎం ఆస్పత్రికి పంపించడానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని చెప్పారు. ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. ప్రజలే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ డైరెక్టర్ పల్లె వెంకట్‌రెడ్డి, నాయకులు మాట్ల రమేష్, కనుకుంట్ల అరవింద్, పిల్లి సతీష్, పుల్ల శోభన్‌బాబు, పుల్ల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

రెగ్యులరైజ్ చేయాలని ధర్నా



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

పరకాల : తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సెకండ్ ఏఎన్ఎంలు పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సెకండ్ ఏఎన్ఎంలు మీడియాతో మాట్లాడారు. సుమారు 16 ఏళ్లుగా తక్కువ వేతనంలో సేవలు అందిస్తున్నామని తెలిపారు. అయినా ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని వాపోయారు. కరోనా కాలంలో ప్రాణాలను లెక్క చేయకుండా ప్రజలకు సేవలు అందించినట్టు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఎలాంటి పరీక్ష లేకుండానే తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సెకండ్ ఏఎన్ఎంలు డి.సునీత, ఓ.కరుణ, పి.రజిత, రజని, పి.శారద, సాంబలక్ష్మి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలలను ఆదుకునే దిశగా సర్వే



పరకాల : అనాథ బాలలను ఆదుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపట్టిందని పట్టణంలోని 1వ వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ఏమరకు స్థానిక మున్సిపల్ ఉద్యోగులతో కలిసి చేపట్టిన అనాథ బాలల సర్వే కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనాథ పిల్లలను ఆదరించటానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. మూడు కుటుంబాలకు చెందిన ఐదుగురు అనాథ బాలలను గుర్తించినట్టు చెప్పారు. అనాథ బాలలను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు విజేందర్, సీఎల్ఆర్పీ జయప్రద పాల్గొన్నారు.

'గిరిజనబంధు' అమలులో వివక్ష



సమావేశంలో మాట్లాడుతున్న భీమా సాహెబ్

ఎల్కతుర్తి : దళితబంధు, బీసీబంధు పథకాలను తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం గిరిజనబంధు పథకాన్ని ప్రకటించడంలో వివక్ష పాటిస్తోందని గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమా సాహెబ్ విమర్శించారు. భీమదేవరపల్లి మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులను, బీసీ, మైనార్టీలను ఆదుకునేలా దళితబంధు, బీసీబంధు, తదితర పథకాలను ప్రకటించిందని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు సైతం గిరిజనుల కోసం అనేక హామీలు గుప్పించినా తదనంతరం విస్మరించిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 15 లక్షల గిరిజన కుటుంబాలుండగా అందులో 10 లక్షలకు పైగా కుటుంబాలు కటిక పేదరికంలో అల్లాడుతున్నా ఆదుకోలేదని తెలిపారు. గిరిజనబంధు అమలు చేస్తామని గతేడాది సెప్టెంబర్‌లో సీఎం కేసీఆర్ ప్రకటించినా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదన్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గిరిజనబంధును ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వాలని, గిరిజన మంత్రికి, ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి ఉంటే సీఎం కేసీఆర్ మీద ఒత్తిడి తీసుకొచ్చి గిరిజనబంధు అమలు కోసం జీఓను జారీ చేయించాలని హితవు పలికారు. గిరిజనబంధు సాధన కోసం విద్యార్థి, యువజన, ఉద్యోగ సంఘాలు, మేధావులు కలిసి రావాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు మాలోతు రాజేష్‌నాయక్, లావుడ్య రాజేందర్‌నాయక్, భంగినాయక్, లక్‌పతినాయక్, తిరుపతి నాయక్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

15న కృష్ణ అంగారక చతుర్దశి వ్రతం

ధర్మసాగర్ : మండలంలోని క్యాతంపల్లి గ్రామ శివారులోని శ్రీ ఓషధీశ్వర మానసాదేవి సహిత నవ నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 15న ఉదయం 8 గంటలకు కృష్ణ అంగారక చతుర్దశి వ్రతం నిర్వహించనున్నట్టు ఆలయ ట్రస్ట్ చైర్మన్ పవన్ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్రతాన్ని కృష్ణపక్షంలో మంగళవారం నాడు వచ్చే చతుర్దశి రోజున ఆచరించాలని సూచించారు. ముందుగా దీపారాధన, ఆచమన, సంకల్ప, కలశ, గణాధిపతి పూజ, మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించి తదనంతరం ఎర్రటి వస్త్రాన్ని పరిచి త్రికోణాకారంలో రెండు ముగ్గులు వేసి రెండు కలశాలు ఉంచాలని తెలిపారు. ఒక కలశంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని, మరో కలశంలో అంగారకున్ని ఆవాహనం చేసి షోడశ ఉపచారములు సమర్పించి కథ శ్రవణం చేయాలని పేర్కొన్నారు. 14 గ్రంధి కలిగిన తోరణాన్ని కంఠములో లేదా చేతిపై ధరించాలని తెలిపారు. కందిపప్పుతో చేసిన 14 భక్షాలతోపాటు దక్షిణ తాంబూలాదులు బ్రాహ్మణుడికి ఇచ్చి ఆశీర్వాదం పొందాలని సూచించారు. వ్రతంలో ప్రజలు పాల్గొని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అంగారకుడి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. ఆసక్తి కలిగిన కుటుంబాలు సెల్ నంబర్ 9908998839లో సంప్రదించి గోత్రనామాలు నమోదు చేయించుకోవాలని కోరారు.



బియ్యం పంపిణీ

కరీమాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన మల్లు స్వరాజ్యంనగర్(రాజీవ్ గృహకల్ప) బాధితులకు సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి మాట్లాడుతూ పార్టీ పక్షాన 200కుటుంబాలకు బియ్యం పంపిణీ చేసినట్లు వివరించారు. పేదలకు ఏ సమస్య వచ్చినా పోరాడేందుకు సీపీఎం నిత్యం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గున్నాల ప్రభాకర్, సాజియా, ఉపేందర్, దివ్య, మధుకర్, మల్లయ్య, ఇస్మాయిల్, రతన్, యాకుబ్‌పాషా, శ్రీను, సరిత, జుబేదా, స్వరూప, జహీదా తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ సేవలను వినియోగించుకోవాలి

ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామంలో దర్గా సొసైటీ ద్వారా అందుతున్న సేవలను రైతులు వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని వైస్ చైర్మన్ మాదాసు బాబు ఆకాంక్షించారు. కొండపర్తిలో ఆ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణాన్ని యూరియా బస్తాలు విక్రయించి శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందుతాయని తెలిపారు. సొసైటీ సేవలను విస్తరిస్తున్న క్రమంలోనే ఎరువుల దుకాణాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రైతుబంధు కోఆర్డినేటర్ మండల సమ్మిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ సుల్తాన్ వెంకన్న, ఒడియాల భూపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అప్పిడి రాజిరెడ్డి, మేడిపల్లి వెంకటరమణ, మహేందర్ యాదవ్, సీఈఓ భూపాల్‌రెడ్డి, అసిస్టెంట్ సీఈఓ జ్ఞానేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.



దుకాణాన్ని ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ బాబు

గ్రూప్‌-2 పరీక్షలు వాయిదా వేయాలి



హన్మకొండ: గ్రూప్ -2 పరీక్షలను వాయిదా వేయాలని బహుజన సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు డిమాండ్ చేశారు. ఈమేరకు బీఎస్పీ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేద్కర్ కూడలిలో శనివారం రాస్తారోకో చేసి అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గ్రూప్ -2 పరీక్షలు వాయిదా వేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద సత్యాగ్రహ దీక్షకు పూనుకోగా, అతన్ని గృహ నిర్బంధం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో గ్రూప్ -2లో 73శాతం వరకు సిలబస్ మారిందని చెప్పారు. కార్యక్రమంలో బీఎస్పీ జోనల్ మహిళా కన్వీనర్ అడ్లూరి పద్మ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మంజుల మణి, నాయకులు పసుల వినయ్ అంబేద్కర్, అమ్మ సాంబయ్య, ఎండీ.మినాజ్, బొట్ల నితిన్, లత, రజిత, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలోని లైబ్రరీ ఆవరణలో..

కేయూ క్యాంపస్: తెలంగాణలో ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న గ్రూపు-2 పరీక్షలను నాలుగు నెలలపాటు వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రూపు -2 అభ్యర్థులతో కలిసి కాకతీయ యూనివర్సిటీలోని లైబ్రరీ ఆవరణలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ నెలంతా పోటీ పరీక్షలు ఉన్నందున గ్రూపు -2 పరీక్షల కోసం సన్నద్ధం అయ్యేందుకు అభ్యర్థులకు సమయం కావాలని కోరారు. కార్యక్రమంలో రాజకుమార్, సందీప్, గణేష్, సునీల్‌కుమార్, సాయి, వినయ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల్లోని అన్ని కులాలకు రుణాలివ్వాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

కాశిబుగ్గ: వెనుకబడిన తరగతుల్లోని అన్ని కులాలకు చెందిన వారికి బీసీ బంధు పథకం వర్తింపజేస్తూ రూ.10 లక్షలు రుణంగా అందించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ ఆధ్వర్యంలో వరంగల్ కాశిబుగ్గ జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో బీసీలకు మరింత అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత బంధు పథకం దళితుల్లోని అన్ని కులాలకు వర్తింపజేసినప్పుడు బీసీలో అన్ని కులాలకు ఎందుకు వర్తింప చేయడం లేదని, బీసీలో 133 కులాలు ఉంటే కేవలం 13 కులాలకు బీసీ బంధు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, రత్నం సతీష్‌షా, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు



మాట్లాడుతున్న ఎంపీపీ తిరుపతిరెడ్డి

శాయంపేట : ప్రతీ ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందించిందని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలోని తహరాపూర్ గ్రామంలో శనివారం ఆయన ఆధ్వర్యంలోని బృందం ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరించింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి నాయకత్వంలో మండలం అభివృద్ధి చెందుతోందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గుర్రం అశోక్, రాంశెట్టి లక్ష్మారెడ్డి, గొట్టిముక్కుల విష్ణువర్ధన్‌రెడ్డి, రేణికుంట్ల సదయ్య, జిన్నా రాజేందర్, ఇమ్మిడిశెట్టి రవీందర్, నిమ్మల మహేందర్, పాకాల ప్రతాప్‌రెడ్డి, రేణికుంట్ల సుమన్, ఎల్ల వెంకట్‌రెడ్డి, రేణికుంట్ల భరత్, రేణికుంట్ల రాజశేఖర్, కొమ్ముల సంతోష్, మహేందర్, శ్రీనివాస్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

కోఆప్షన్ సభ్యుడికి సతీవియోగం

కమలాపూర్ : కమలాపూర్ మండల కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ ఖాజా హసనోద్దీన్‌కు సతీవియోగం కలిగింది. అతడి భార్య షహనాజ్ బేగం (55) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. షహనాజ్ బేగం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆమెను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. షహనాజ్ బేగం మృతదేహానికి రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆస్పత్రిలో నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం వివిధ అనారోగ్య కారణాలతో ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కమలాపూర్ మండలానికి చెందిన పలువురిని చైర్మన్ శ్రీనివాస్ పరామర్శించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ దేవేందర్‌రావు, ఎంపీటీసీ సంపత్‌రావు, మాజీ జెడ్పీటీసీ నవీన్‌కుమార్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ముజీబ్ హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



షహనాజ్ బేగం మృతదేహానికి నివాళులర్పిస్తున్న గెల్లు శ్రీనివాస్

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

హసన్‌పర్తి: అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని ఆర్య సమాజ్ నూతన భవన నిర్మాణానికి రూ.5 లక్షలు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా అందుకు సంబంధించిన ఉత్తర్వుల ప్రతులను నిర్వాహకులకు హనుమకొండలోని తన స్వగృహంలో ఎమ్మెల్యే శనివారం అందజేశారు. కార్యక్రమంలో 56వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆర్య సమాజ్ ప్రతినిధులు పీ.రవీందర్, శీలం వెంకటస్వామి, హసన్‌పర్తి మండల వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ విజయ్ పాల్గొన్నారు.

కొత్తవారికి కూడా తగిన గుర్తింపు

కొత్తగా పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఇస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు, వంగపహాడ్ పీఏసీఎస్ డైరెక్టర్ తెట్టె గణేష్ శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గణేష్‌ను పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. హనుమకొండలోని ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జంగా కుమార్, పీఏసీఎస్ చైర్మన్ మేర్గు రాజేష్, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన, డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, గ్రామశాఖ అధ్యక్షుడు చింతం శ్రీనివాస్, మన బడి - మన బాధ్యత నియోజకవర్గ కన్వీనర్ దోమకుమార్, నాయకులు భాస్కర్, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆర్య సమాజ్ ప్రతినిధులు

పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యం

కాజీపేట: పేదలకు సకాలంలో వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో 108 సర్వీసులను రాష్ట్ర ప్రభుత్వం నడిపిస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. నూతన 108 సర్వీస్‌ను కాజీపేట చౌరస్తాలో శనివారం ప్రారంభించారు. 108 సర్వీస్ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచడాన్ని సిబ్బంది హర్షిస్తూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ్, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్, ఈఎంఈ రాము, చంద్రశేఖర్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

చీఫ్‌విప్‌ను కలిసిన రేషన్ డీలర్లు

హన్మకొండ : ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్‌ను తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి చిలగాని మోహన్ ఆధ్వర్యంలో పలువురు రేషన్ డీలర్లు కలిశారు. రేషన్ డీలర్ల సమస్యలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపిన సందర్భంగా బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వినయ్‌భాస్కర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వీరస్వామి, కృష్ణవేణి, గౌరీశంకర్, పి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి యుద్ధభేరిని విజయవంతం చేయాలి

వరంగల్: సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం పద్మశాలీలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని, అందులో భాగంగా జగిత్యాల జిల్లా కోరుట్లలో ఆదివారం నిర్వహించనున్న 'పద్మశాలి రాజకీయ యుద్ధభేరి'ని విజయవంతం చేయాలని వరంగల్ తూర్పు బీజేపీ నేత డాక్టర్ వన్నాల వెంకటరమణ పిలుపునిచ్చారు. ఎల్‌బీనగర్‌లోని కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల్లో అత్యధిక జనాభా కలిగిన పద్మశాలీలకు గుర్తింపునిచ్చి రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. చేనేత రంగం అభివృద్ధికి అనేక ప్రోత్సాహకాలు అందజేయాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. సమావేశంలో నాయకులు ముంజ్రాతి వెంకన్న, మల్లికార్జున్, చంద్రమౌళి, అపురూప రజనీష్ నేత, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.